క్లుప్తంగా

శ్రీలక్ష్మీనరసింహునికి విశేష పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు విశేషమైన ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ జరిపారు. ఈ సందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా పుండీశ్వరస్వామి ఉత్సవాలు

రామసముద్రం : మండలంలోని మూగవాడి గ్రామంలో వెలసిన అతి పురాతన శ్రీ పుండీశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం, శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను మూగవాడి, ఎం.కొత్తూరు గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. ఇంటింటా మహిళలు భక్తి శ్రద్ధలతో స్వామి, అమ్మవారికి కర్పూర హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అలాగే శనివారం స్వామివారిని ఆలయం చుట్టూ, గ్రామం చుట్టూ మొక్కుబడి మెరివిన్లు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

కంభంమిట్టపల్లెకు శ్మశాన స్థలం కేటాయించాలి

పీలేరు రూరల్ : మండలంలోని అగ్రహారం పంచాయతీ కంభంమిట్టపల్లె దళితవాడకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లా అఖిల భారత మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు గుర్రం నారాయణ కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సూపరింటెండెంట్ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశాన వాటిక కోసం పలు మార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అమృతతేజ, సదాశివకుమార్, రమేష్, రామచంద్ర, గోపీ, వినోద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువే సమాజానికి వెలుగు

తంబళ్లపల్లె : బాలికల చదువుతోనే సమాజంలో వెలుగులు నిండుకుంటాయని అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమా, సరస్వతి, చంద్రకళ తెలిపారు శనివారం స్థానిక అంగన్‌వాడీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహించారు. చిన్నారులు ప్లకార్డులు చేతపట్టి లింగనిర్ధారణ చేయవద్దు .. లింగ వివక్షత తగదు..బాల్య వివాహాలు చేయకండి.. స్త్రీలను గౌరవించండి.. బాలికలు, మహిళలపై అత్యాచారాలు అరికట్టాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.

నేటి నుంచి వాహనదారులకు బాదుడు

పెద్దతిప్పసముద్రం : వాహనాలు నడిపేవారు ఈ నెల 2 నుంచి రోడ్డు రవాణా నిబంధనలు పాటించకుంటే భారీగా జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ హరిహర ప్రసాద్ శనివారం మండల కేంద్రంలో వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.1.035లు, లైసెన్స్ లేకుంటే రూ.5 వేలు, మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానాతో పాటు లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తారన్నారు. సీట్ బెల్ట్ లేకున్నా, మితిమీరిన వేగంతో వాహనం నడిపినా రూ. వెయ్యి జరిమానా ఉంటుందన్నారు. అదే విధంగా మైనర్లు వాహనాలు నడిపితే భారీ జరిమానాతో పాటు వాహన యజమానికి జైలు శిక్ష ఉంటుందని ఎస్‌ఐ స్పష్టంగా ప్రజలకు వివరించారు.

సమస్యల పరిష్కారం ఇంకెప్పుడు?

బి.కొత్తకోట: మండలంలోని గ్రామాల నుంచి ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుల పరిష్కారంలో నెలకొన్న నిర్లక్ష్యంపై మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, రెవెన్యూ సదస్సుల్లో అందిన వినతులపై పరిష్కారానికి తీసుకొంటున్న చర్యలపై తహసీల్దార్, వీఆర్‌ఓలతో సమీక్షించారు. ప్రతి వీఆర్‌ఓ పరిధిలోని పెండింగ్ ఫిర్యాదులపై వీఆర్‌ఓల వారీగా సమీక్షించారు. ఎవరి వద్ద ఎన్ని ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి పరిష్కారానికి ఇంకా ఎంత గడువు కావాలని వారినే ప్రశ్నించి గడువిచ్చారు. ఈ మేరకు సమస్యలు తీర్చకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే హామీ ఏమైంది?

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కాలేజీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ ప్రైవేట్ పరం కాకుండా కాపాడుతానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఇచ్చిన హామీ ఏమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమం చేపడతామన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిని ప్రైవేట్‌పరం కాకుండా శాసన సభ్యుడు షాజహాన్ బాషా హామీ ఇచ్చి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లా ఆసుపత్రిని కాపాడేందుకు మరోసారి ఉద్యమం చేపడతామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు


మదనపల్లె: గదుల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


పరీక్షా కేంద్రం వద్ద తల్లిదండ్రులతో విద్యార్థులు


పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు


గుర్రంకొండలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మదనపల్లె సిటీ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మదనపల్లెలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని 11 కేంద్రాల్లో 4,092 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను ఇన్విజిలేటర్లు క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు హాల్‌టిక్కెట్లు తీసుకుని పరీక్షా కేంద్రాల గదుల నంబర్లను చూసుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు తాగునీరుతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు. చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు డిపార్టుమెంటు ఆఫీసర్లు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సకాలంలో పరీక్షలకు హాజరు కావాలి

కలకడ : ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులందరూ సకాలంలో చేరుకోవాలని కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ పుష్ప కుమారి, డిపార్ట్‌మెంటల్ అధికారి భాస్కర్‌రెడ్డి కోరారు. కలకడ కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాల, సాయి జూనియర్ కళాశాల, కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కలికిరి మండలం మహల్ జూనియర్ కళాశాల, కేవీపల్లె మండలం గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో 412 మంది విద్యార్థులకు 397 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. కలకడ ఎస్‌ఐ రామాంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


గుర్రంకొండలో ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల పరుగులు

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ రామాంజనేయప్రసాద్, డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెలుగు, హిందీ మొదటి పేపర్ల పరీక్షలు జరిగాయి. 154 మంది విద్యార్థులకు 146 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్.ఐ లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నలుగురు విద్యార్థులు గైర్హాజరు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండ తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు మొత్తం నలుగురు విద్యార్థులు గైర్హాజయ్యారు. స్థానికంగా ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 178 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. అయితే నలుగురు విద్యార్థులు గైర్హాజయ్యారు. కాగా పరీక్షా సమయం మించిపోయే సమయానికి పది మంది విద్యార్థులు ఆలస్యంగా చేరుకోవడంతో పరుగులు తీసి ఎట్టకేలకు గేట్లు మూసేలోగా కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులు, అధ్యాపకులు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు.


కలకడలో ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పీలేరులో..

పీలేరురూరల్ : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు వై. వెంకటరెడ్డి, బేబీ కరుణ, రెడ్డెప్ప తెలిపారు. శనివారం మూడు సెంటర్లలో 1165 మంది విద్యార్థులకు 62 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వారు తెలిపారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపల్ చిట్టిబాబు తెలిపారు. మొత్తం 207 మంది విద్యార్థులకు, 7 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌ఐ రవికుమార్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : నిమ్మనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు. పరీక్షల నిర్వహణ అధికారి ఇందు శేఖర్ మాట్లాడుతూ శనివారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 201 మంది విద్యార్థులకు 192 మంది విద్యార్థులు హాజరయ్యారని, 9 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోని గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


రామసముద్రంలో ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు


గుర్రంకొండలో పరీక్షా కేంద్రంలోకి పరుగులు తీస్తున్న విద్యార్థులు

రూ.1.66 కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు

- భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్
- లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ

మదనపల్లె : మున్సిపాలిటీలోని సిద్దమ్మ లేఔట్, పీఅండ్‌టీ కాలనీ, సొసైటీకాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డెప్పనాయుడు కాలనీల్లో రూ.1.66 కోట్లతో అభివృద్ధి పనులకు శనివారం భూమి పూజ నిర్వహించారు. చైర్‌పర్సన్ మనూజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భూమిపూజలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ...పట్టణంలోని 35 వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు పెద్ద సంఖ్యలో నిర్మాణం చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు తీసుకువచ్చి జిల్లాలోనే మదనపల్లె మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేణుక, క్రిస్టియన్ మైనారిటీ నాయకుడు బోనాసి జాన్‌బాబు, నాయకులు రాధ, పులి మహాలక్ష్మి, శశికుమార్, బాబ్జీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి

టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి సహకరించండి

మదనపల్లె : వందేళ్ల ఘన చరిత్ర కలిగిన మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని చైర్‌పర్సన్ నాదెళ్ల విద్యాసాగర్ నాయుడు కోరారు. శనివారం బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సహకార వ్యవస్థ స్ఫూర్తితో 1924లో ఏర్పాటైన మదనపల్లె టౌన్‌బ్యాంక్ ప్రజలందరి ఆదరాభిమానాలతో 100 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తిచేసుకోవడం గర్వకారణమన్నారు. ఈ ఏడాది మేలో టౌన్‌బ్యాంక్ శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పట్టణంలోని మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి టౌన్‌బ్యాంక్ విశేష కృషి చేస్తోందన్నారు. 2011లో రూ.20కోట్లు ఉన్న బ్యాంక్ డిపాజిట్లు నేడు..రూ.92 కోట్లకు చేరుకున్నాయన్నారు. 160 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని, 100 కోట్లు డిపాజిట్లు సేకరణ జరపాలన్నది లక్ష్యంగా ముందుకెళుతున్నామని తెలిపారు. జాతీయ, కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా డిపాజిట్‌దారులకు అధిక వడ్డీ అందించడమే కాకుండా, ప్రజల అవసరాలకు అనుగుణంగా తక్కువ వడ్డీ రేట్లతో అన్ని రకాల రుణాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ వైస్‌చైర్మన్ మహర్షి భాస్కర్, డైరెక్టర్లు రాటకొండ సోమశేఖర్, నాదెళ్ల శివ, ముక్తియార్, శ్రీరామ రవికాంత్‌బాబు, సర్దార్, ముక్తియార్, నిరంజన్, రామిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ నాయుడు, డైరెక్టర్లు

ఘనంగా మాదిగ అమర వీరుల దినోత్సవం

రామసముద్రం : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు జి.సుధాకర్, ఆర్.విశ్వనాథ్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రాజేష్ హాజరయ్యారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి వాసు, ఎంఎస్‌పీ వైస్ ప్రెసిడెంట్ గుండ్లపల్లె శ్రీనివాసులు, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్, యువసేన నాయకులు ఆలోక్, మణి, హరి తదితరులు పాల్గొన్నారు.


రామసముద్రంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గాలి కుంటు వ్యాధి టీకాలు వేయించండి

పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్

నిమ్మనపల్లె : పశువులలో వచ్చే గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. శనివారం స్థానిక పశు వైద్య కేంద్రంలో గాలికుంటు వ్యాధికి టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పశు వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ప్రస్తుతం మండలంలో 12500 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజులపాటు ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, హరి, తదితరులు పాల్గొన్నారు.


గాలికుంటు వ్యాధి టీకాలను వేయిస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్

అధికారుల తప్పులకు సామాన్యులను బలిచేయవద్దు

మదనపల్లె : మండలంలోని సీటీఎం క్రాస్ సర్వే నెంబర్.779/2లో మూడేళ్ల క్రితం యర్రబల్లి రెడ్డెమ్మ నిర్మించుకున్న ఇల్లు అక్రమనిర్మాణం అంటున్న రెవెన్యూ అధికారులు..గతంలో వారు ఇచ్చిన పట్టా ఆధారంగానే నిర్మాణం జరిపారని, అక్రమమైతే, అప్పటి తహసీల్దార్ ఎందుకు పట్టా మంజూరుచేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు సామాన్య ప్రజలను బలిచేయడం సమంజసం కాదని పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఇల్లు నిర్మాణదశలో ఉన్నప్పుడే, అధికారులు ఎందుకు అడ్డుకోలేదని, మూడేళ్ల తర్వాత అక్రమ నిర్మాణమని కూలిస్తే నష్టపరిహారం రెవెన్యూ అధికారులు చెల్లిస్తారా? ఆ కుటుంబాన్ని ఆదుకుంటారా? అని ఆయన ప్రశ్నించారు. కొంతమంది రెవెన్యూ అధికారులు చేస్తున్న పనులకు పేదవారు నష్టపోతున్నారన్నారు.

ఈనెల 5న నీలగిరి చెట్లకు వేలంపాట

నిమ్మనపల్లె : ఈనెల 5వ తేదీన నీలగిరి చెట్లకు బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు తవ ళం పంచాయతీ కార్యదర్శి గౌతమి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. తవళం పంచాయితీ పరిధిలోని కోమటివాని చెరువులో ఉన్న నీలగిరి చెట్లకు ఈనెల 5వ తేదీ బుధవా రం ఉదయం 11 గంటలకు తవళం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నామన్నారు.

గురుకుల విద్యాలయాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల్లో, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు గ్యారంపల్లె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి తోపాటు 6, 7, 8వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకో వడానికి మార్చి 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. తవళం పంచాయతీ కుమ్మరపల్లెకు సమీపంలోని చింత చెట్టు కింద నలుగురు వ్యక్తులు జూదం ఆడుతుండగా సిబ్బందితో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. కుమ్మరపల్లెకు చెందిన మల్లికార్జున, విజయకుమార్, వెంకటేష్, శివ లపై కేసు నమోదు చేశామన్నారు.

వీఆర్‌ఓల బదిలీలు

బి.కొత్తకోట : మండలంలో పనిచేస్తున్న పలువురు వీఆర్‌ఓలను బదిలీ చేస్తూ మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాలు జారీ చేశారు. గుమ్మసముద్రం గ్రామం గండువారిపల్లిలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన వీఆర్‌ఓ కోటిరెడ్డిని మదనపల్లెకు, తుమ్మనంగుట్ట వీఆర్‌ఓ జయరామిరెడ్డిని కోటావూరుకు, కోటావూరు వీఆర్‌ఓ వరదరాజులును తుమ్మనంగుట్టకు, సింహంవీధి వీఆర్‌ఓ మల్లికార్జునను గుమ్మసముద్రంకు బదిలీ చేశారు.

బేటీ బచావో - బేటీ పడావో ర్యాలీ

కలికిరి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుంధతి మాట్లాడుతూ ఆడ పిల్లలకు అభద్రతాభావం పోవాలంటే సమాజంలో ఆడ పిల్లలపై జరుగుతున్న ఆఘాయిత్యాలు నశించాలన్నారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ప్రసన్న, అమ్మాజీ పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ

కలకడ : అర్హులకు ఇంటి వద్దనే పింఛన్ అందించాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం ఆదేశించారు. శనివారం మండలంలోని కలకడ, కె.దొడ్డిపల్లె పంచాయతీలలో పంపిణీ చేస్తున్న పింఛన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఎవ్వరి వద్ద ఎలాంటి లంచం తీసుకోవద్దన్నారు. పింఛన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే వేటు తప్పదని హెచ్చరించారు.

కోర్ ఇంజినీరింగ్ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు

మదనపల్లె సిటీ : కోర్ ఇంజినీరింగ్ శాఖల్లో ఎక్కువ ఉద్యోగ అవకాశాలున్నాయిని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం కాలేజీఆలో ఈసీఈ, ఈఈఈ విద్యార్థులకు సాంకేతిక సెమినార్ నిర్వహించారు. ఆటోమేషన్‌లో ఎలక్ట్రానిక్స్ పాత్రను వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, మెకోర్డా ఫ్యాకల్టీ పార్థసారథి, దినేష్‌రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

అమ్మవారి కలశాలతో ఊరేగింపు


కలశాలు, అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపుగా వస్తున్న ఆర్యవైశ్యులు



అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘ నాయకులు

మదనపల్లె సిటీ : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్యవైశ్యహాస్టల్ నుంచి అమ్మ చిత్రపటంతో పాటు కలశాలతో పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. జై వాసవీ.. జై జై వాసవీ అంటూ ఆర్యవైశ్యులు నెహ్రూబజార్, అప్పారావువీధి, ఆర్‌ఆర్‌వీధి నుంచి వాసవీ కన్యకా భవన్ వీధి వరకు ఊరేగింపు జరిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డూండి రాకేష్ హాజరయ్యారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి ప్రార్థన, స్వస్తివాచనం, కలశస్థాపన, వేదపారాయణం, అగ్నిప్రతిష్టా పూర్వక మహాగణపతి హోమాలను ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రశర్మ, సీఎస్ సుబ్రమణ్యం, కృష్ణకాంత్‌శర్మలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి గిరిధర్, ప్రవీణ్, ఎల్లంపల్లి ప్రశాంత్, వాసవీ మహిళా సంఘం, యువజన సంఘం, భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

కనిపించిన నెలవంక

నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

మదనపల్లె సిటీ : ముస్లింలు పరమ పవిత్రంగా భావించే రంజాన్ మాసం నెలవంక శనివారం దర్శనమిచ్చింది. దీంతో ఆదివారం నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుంది. శనివారం సాయంత్రం మగ్రిబ్ నమాజ్ అనంతరం జిల్లాలోని అన్ని మసీదుల వద్ద ముస్లింలు రంజాన్ నెలవంకను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ మాసం ప్రారంభం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని పట్టణంలోని జామియా మసీదుతో పాటు అన్ని మసీదులలో సహరీ, తరావీ నమాజ్ (ప్రార్థనలు) అలాగే సహరీ, ఇఫ్తార్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ ఖాజీ మౌలానా జలాలుద్దీన్ తెలిపారు.


మదనపల్లెలో కనిపించిన నెలవంక


నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

పీలేరు రూరల్ : ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్‌మాసం ప్రారంభమైందని, ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు పాటించాలని ప్రభుత్వ ఖాజీ సయ్యద్ నవాజుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం సాయంత్రం నెలవంక కనిపించిందని, దీంతో రంజాన్ మాసం ప్రారంభమైందని తెలిపారు. ఆదివారం నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజూ సహరీ, ఇఫ్తార్ జరుపుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఉపవాస దీక్షలు ఆచరించి అల్లాహ్ కరుణ, కటాక్షాలు పొందాలన్నారు.


సయ్యద్ నవాజుద్దీన్

రంజాన్ మాస శుభాకాంక్షలు

కలికిరి(వాల్మీకిపురం) : నియోజకవర్గ ముస్లింలకు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రంజాన్ మాస ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, కఠోర ఉపవాస దీక్ష, భక్తిశ్రద్ధలతో నమాజ్ ప్రార్థనలు చేయడం ప్రత్యేకమన్నారు. శాంతి, సహనం, దానగుణాలతో ముస్లింల ఉపవాస దీక్షలు కొనసాగాలని ఆకాంక్షించారు.


చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో నియామకాలు

బి.కొత్తకోట : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. శనివారం ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. యూత్ విభాగానికి కె.వాసుదేవరెడ్డి, మహిళా విభాగానికి పద్మజారెడ్డి, రైతు విభాగానికి వెంకట సుబ్బిరెడ్డి, బీసీ సెల్‌కు రెడ్డిశేఖర్, ఎస్సీ సెల్‌కు వెంకట మోహన్, ఎస్టీ సెల్‌కు రెడ్డెప్పనాయక్, మైనార్టీ సెల్‌కు సయ్యద్ బాషా, క్రిస్టియన్ మైనార్టీసెల్‌కు బాబిని నియమించారు. అలాగే స్టూడెంట్ విభాగానికి అభిలాష్, పంచాయతీరాజ్ విభాగానికి ఆనందరెడ్డి, ఆర్‌టీఐ వింగ్‌కు ఏవీ కుల్‌దీప్‌రెడ్డి, వలంటీర్స్ విభాగానికి మేకల చరణ్, గ్రీవెన్స్ సెల్‌కు సురేంద్రనాథ్, వాణిజ్య విభాగానికి కె.రెడ్డిశేఖర్, వీవర్స్ వింగ్‌కు జి.వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ విభాగానికి నాగేంద్ర, లీగల్ సెల్‌కు సింగరయ్య, సాంస్కృతిక విభాగానికి బి.రాధ, సోషల్ మీడియా విభాగానికి శ్రీకాంత్, ఐటీ విభాగానికి రాజశేఖర్‌రెడ్డి, దివ్యాంగుల విభాగానికి చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్స్ విభాగానికి రామచంద్రారెడ్డి, మేధావుల ఫోరంకు తూగు గోపాల్‌రెడ్డి, బూత్ కమిటీల విభాగానికి రెడ్డి హరి, పబ్లిసిటీ విభాగానికి అయాబ్ బాషాలను నియమించారు.

బూత్ కమిటీ అధ్యక్షునిగా నియామకం

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తెల్లం భరత్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ విభాగం జోనల్ అధ్యక్షునిగా నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

అమ్మాయిలు ధైర్యంగా సమస్యలు ఎదుర్కోవాలి

నిమ్మనపల్లె : అమ్మాయిలు ధైర్యంగా సమస్యలు ఎదుర్కోవాలని ఎస్‌ఐ తిప్పేస్వామి అన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం జరుపుకోనున్న సందర్భంగా, మార్చి 1వ తేదీ నుంచి వారం రోజుల పాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు, మహిళల అభ్యున్నతి పై ప్రత్యేక కార్యాచరణలో భాగంగా, శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థినులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాల్య వివాహాలు , గుడ్ టచ్, బ్యాడ్ టచ్ , పోక్సో చట్టం, మహిళల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసు విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తిప్పేస్వామి